## క్లుప్తంగా

### చిన్నారులకు టీకాలు తప్పనిసరి



మాత్రలు అందజేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఐదేళ్లలోపు చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన స్టాంటన్‌పురం అంగన్‌వాడీ సెంటర్‌లో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.ఆయన మాట్లాడుతూ మెడికల్ ఆఫీసర్ టీకాల కార్యక్రమానికి ముందు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న సచివాలయానికి సెషన్ షెడ్యూల్ వేస్తారని, తర్వాత రోజు ఏఎన్‌ఎంలు టీకాల కార్యక్రమాన్ని మొదలు పెట్టి పిల్లలకు, గర్భిణులకు టీకాలు వేయించి ఆ వివరాలు నమోదు చేయాలన్నారు. అనంతరం గర్భిణులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్‌ఏ, విటమిన్–ఎ సిరప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, డీ సీ ఎం ప్రసాద్, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

### ఏఎన్‌ఎం ట్రైనింగ్ కోర్సు దరఖాస్తుకు గడువు పెంపు

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన (ఏ గ్రూపు అయినా) మహిళలకు రెండేళ్ల ఉచిత మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్/ఏఎన్‌ఎం ట్రైనింగ్ కోర్సులో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు ఆదర్శ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రైనింగ్ కళాశాల కరస్పాండెంట్ ఈదూరు పద్మాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9848352725, 7416404740 సంప్రదించాలన్నారు.

### జేవీడికి జాయింట్ అకౌంట్‌పై పునరాలోచించాలి

కర్నూలు(సెంట్రల్): జగనన్న విద్యా దీవెనకు జాయింట్ అకౌంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఉదయ్ డిమాండ్ చేశారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాయింట్ అకౌంట్ నిర్ణయాన్ని తీసుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేయాలని కోరారు.

### ఏడీ సరెండర్‌పై హైకోర్టు స్టే

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఏడీ రమేష్‌బాబు సరెండర్‌పై హైకోర్టు స్టే ఇచ్చింది. శనివారం రమేష్‌బాబు ఆసుపత్రిలో తిరిగి విధుల్లో చేరేందుకు వచ్చారు. ఆ సమయంలో సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సెలవులో ఉండటంతో కోర్టు ఉత్తర్వులను రమేష్‌బాబు తపాలాలో ఇచ్చి వెళ్లారు. సోమవారం డాక్టర్ వెంకటరంగారెడ్డి రాగానే స్టే ఉత్తర్వులపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

### సెక్యూరిటీ గార్డులకు జీతాలివ్వాలి




ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక మెడికల్ కాలేజీ, హాస్టళ్లలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులకు జీతాలు ఇవ్వాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్‌కు సీఐటీయూ నాయకులు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ ద్వారా సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారని, వారికి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఓల్డ్‌సిటి కమిటీ ఉపాధ్యక్షులు మైమూద్, నగర ప్రధాన కార్య దర్శి మారెల్ల విజయ రామాంజనేయులు, నాయకులు డి.కుమార్, ఆటో యూనియన్ నాయకులు బడేబాషా, నాగరాజు, నబీసా ఉన్నారు.

### చేతులు శుభ్రంగా కడుక్కోవాలి

కర్నూలు సిటీ: విద్యార్థులు టాయిలెకు వెళ్లి వచ్చాక, భోజనం చేసే సమయంలో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని పేహెల్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర సమన్వయకర్త ఆనంద్‌కుమార్ సూచించారు. శనివారం బిక్యాంపులోని ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో ప్రపంచ టాయిలెట్ డే సందర్భంగా హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం శారదదేవి, ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.

### నివాళి



శేషమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ సుభాష్‌చంద్రబోస్ తదితరులు

కర్నూలు కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ అటెండర్ శేషమ్మ మృతికి శనివారం చైర్మన్ సుభాష్ చంద్రబోస్, కార్యదర్శి పెద్దక్క శేషమ్మ సంతాపం తెలిపారు. శేషమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఆమె సేవలను గుర్తు చేసుకున్నారు.

# .. ఆ సొసైటీ అక్రమాల పుట్ట!

- ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో రూ.కోటి వరకు నిధులు పక్కదారి
- బాధ్యులను తేల్చలేని సహకార ఆడిట్ అధికారులు
- సెక్షన్–51 కింద విచారణకు ఆదేశాలు

పుష్కర కాలం క్రితం ఆవిర్భవించిన ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పుట్టెడు అక్రమాల్లో మునిగితేలుతోంది. సహకార రంగంలో ఏర్పాటైన ఈ సొసైటీలో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. తవ్వే కొద్ది అక్రమాలు బయట పడుతుండటంతో సహకార అధికారులే ఉక్కిరిబిక్కిరవుతున్నారు. – కర్నూలు(అగ్రికల్చర్)

కర్నూలు నగరంలో 2005 వరకు కర్నూలు అర్బన్ బ్యాంకు ఒక వెలుగు వెలిగింది. అయితే అవినీతి, అక్రమాల వల్ల నష్టాల్లో కూరుకుపోవడంతో అర్బన్ బ్యాంకు మూత పడింది. దీని స్థానంలో అర్బన్ బ్యాంకు భవనంలోనే 2010 ప్రాంతంలో ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటైంది. అప్పటి నుంచి నేటి వరకు మాజీ కార్పొరేటర్ బాలరాజు పాలకమండలి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. సహకార చట్టం ప్రకారం చైర్మన్‌కు, సీఈఓకు జాయింట్ చెక్ పవర్ ఉండాలి. ఇక్కడ నాన్ అఫీషియల్ పాలకమండలి చైర్మన్ బాలరాజు ఒక్కరికే చెక్ పవర్ ఉన్నట్లు తెలుస్తోంది. సహకార శాఖ ఆడిటర్లు నిర్వహించిన ఆడిట్ ప్రకారం, వివిధ వర్గాల వారి నుంచి అందిన ఫిర్యాదుల మేరకు సొసైటీలో దాదాపు రూ.కోటి వరకు నిధులు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. అక్రమాలు మరింత ఎక్కువగానే ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సొసైటీకి జిల్లా సహకార కేంద్రబ్యాంకు, తమిళనాడు మార్కెంటైల్ బ్యాంకుల్లో కరంట్ ఖాతాలున్నాయి. మూడు క్యాష్ బుక్‌లు నిర్వహిస్తున్నారు.



కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ

### గడువు తీరినా చెల్లింపులు లేవు...

కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వ్యాపారాన్ని పెంచుకునేందుకు ఒకవైపు డిపాజిట్‌లు సేకరిస్తోంది. డిపాజిట్‌లు రూ.2 కోట్లకు పైగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. మరోవైపు 100 రోజుల కాలపరిమితితో డైలీ డిపాజిట్‌లు కూడా సేకరిస్తోంది. డైలీడిపాజిట్‌ల వసూలుకు సొసైటీ సీఈఓగా వ్యవహరించే వ్యక్తి కుమారుడే ఏజెంటుగా వ్యవహరించే వారు. ఏడాది క్రితం అనారోగ్య కారణాల వల్ల డైలీ డిపాజిట్ ఏజెంట్ నుంచి వైదొలగడంతో ఆయన తండ్రీ, సొసైటీ సీఈఓనే వసూలు చేశారు. గడువు పూర్తయినప్పటికీ డిపాజిట్‌లు వెనక్కి ఇవ్వడం లేదు. డైలీ డిపాజిట్‌లతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల కాలపరిమితి పూర్తయినప్పటికీ ఇవ్వక పోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తవుతోంది. బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక 1వ పట్టణ పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. డైలీ డిపాజిట్‌లు సేకరించే వ్యక్తి మాత్రం తాను ప్రతి రూపాయి సొసైటీలో చెల్లించి రసీదులు తీసుకున్నానని చెబుతున్నారు. మరికొందరు మాత్రం నకిలీ కార్డులపై డిపాజిట్‌లు వసూలు చేశారని చెబుతుండటం గమనార్హం. ఈ వ్యక్తినే నేటికీ సీఈఓగా కొనసాగిస్తుండటం మరో విచిత్రం. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డైలీ డిపాజిట్‌లు ఏమయ్యాయో తెలియని పరిస్థితి. ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు కొంతమంది అరకొరగా చెల్లించి తిప్పుకుంటున్నట్లు ఫిర్యాదులున్నాయి.

### భారీగా బయటపడిన అక్రమాలు

ఏటా సహకార శాఖ ఆడిటర్లు సొసైటీ లావాదేవీలపై ఆడిట్ చేస్తారు. 2020–21 నుంచి సొసైటీలో అక్రమాలు జరుగుతున్నట్లు ఆడిట్‌లో వెల్లడైంది. 2021–22లో నిర్వహించిన లావాదేవీలపై ఆడిట్ నిర్వహించగా రూ.40 లక్షలకుపైగా నిధులు పక్కదారిపట్టినట్లు తెలుస్తోంది. 2022–23లో జరిగిన లావాదేవీలపై సహకార శాఖ ఆడిటర్లు ఆడిట్ నిర్వహిస్తున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు నిధుల దుర్వినియోగం భారీగానే ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు సహకార శాఖ జిల్లా అధికారికి సొసైటీ అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో సబ్ డివిజన్ అధికారి నాగరమణయ్య బృందంతో విచారణకు ఆదేశించారు. కొద్ది రోజులుగా విచారణ జరుగుతున్నా నిధుల దుర్వినియోగం ఏ స్థాయిలో జరిగింది, బాధ్యులెవరనేదానిపై స్పష్టత రాలేదు. సబ్ డివిజనల్ సహకార అధికారి కోరిన మేరకు సహకారం చట్టం సెక్షన్ 51 కింద విచారణ చేయాలని సహకార ఆడిట్ అధికారి శిరీషను డీసీఓ రామాంజనేయులు ఆదేశించారు. అలాగే విచారణ పారదర్శకంగా సాగేందుకు నాన్ అఫీషియల్ పాలక వర్గాన్ని రద్దు చేసి, ఆ స్థానంలో అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు.

### అక్రమాలపై విచారణ జరిపిస్తాం

ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో ఆడిట్‌లో అక్రమాలు వెలుగు చూశాయి. డైలీ డిపాజిట్‌ల కాలపరిమితి తీరినప్పటికి తిరిగి చెల్లించలేదు. సొసైటీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని ఫిర్యాదులు అందాయి. సబ్ డివిజనల్ అధికారులతో విచారణ జరిపించాం. అక్రమాల గుట్టు తేలకపోవడంతో సెక్షన్–51 కింద విచారణ జరపాలని ఆదేశించాం.

– ఎస్.రామాంజనేయులు, డీసీఓ, కర్నూలు

## ఈరోజు

### సూర్య దత్త గోరక్షణ శాల ప్రవేశం

కర్నూలు కల్చరల్: గురు దత్త ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీ సూర్య దత్త గో రక్షణ శాల ప్రవేశ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### కార్తీక వన భోజన మహోత్సవం

కర్నూలు కల్చరల్: వికాస భారతి ఆధ్వర్యంలో ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ సమీపంలోని సురభిగోశాల ప్రాంగణంలో ఆదివారం హిందువుల కార్తీక వనోభజన మహోత్సవాన్ని నిర్వమించనున్నట్లు వికాస భారతి కార్యదర్శి శివప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే డాక్టర్జీ స్ఫూర్తి మందిరం ప్రారంభోత్సవం, ఛత్రపతి శివాజీ, ఝాన్సీ లక్ష్మీబాయి, మహారాణా ప్రతాప్, సర్దార్ వల్లభాయ్ పటేల్, అల్లూరి సీతారామరాజు విగ్రహాల ఆవిష్కరణ ఉంటుందన్నారు.

### వీహెచ్‌పీ ప్రాంత కార్యాలయం ప్రారంభం

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ ప్రాంత కార్యాలయం ఆధునీకరణ భవన ప్రారంభ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుందని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీహెచ్‌పీ ఢిల్లీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వర శర్మ, రాజ్య సభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, జి.పుల్లారెడ్డి చారిటీస్‌ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ జి.రాఘవరెడ్డి, భగవాన్ బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ టి.రామారావు హాజరుకానున్నట్లు తెలిపారు.

## సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): సంక్షేమ పథకాలతో ప్రజల బతుకులు మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం జొహరాపురం, బుధవారపేటలో 14, 16, 17, 18వ వార్డుల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం తెచ్చిన సంక్షేమ పథకాలు వారి జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు పద్మలత, పల్లవి, కో ఆప్షన్ మెంబర్ శ్రీరాములు, నయీమ్, వార్డు ఇన్‌చార్జి పవన్ కుమార్, పార్టీ నాయకులు కేదార్‌నాథ్, ఎజాజ్, క్రాంతి, షౌకత్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

పేదల కష్టాలు తెలిసిన నాయకుడు జగన్

పేదల కష్టాలు తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. శనివారం రాత్రి 48వ వార్డు రోజా వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలిసి ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధి, పథకాల అమలును వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లికా బేగం, పార్టీ నాయకులు మద్దయ్య, ఖలీద్, దాదా బాషా తదితరులు పాల్గొన్నారు.



మహిళ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

## ఆదర్శ వనిత ఝాన్సీ లక్ష్మీ బాయి

కర్నూలు కల్చరల్: ఝాన్సీ లక్ష్మీబాయి ఆదర్శ వనిత అని కేంద్రీయ బాల సంస్కార కేంద్రం ప్రముఖ్ సుశ్రీ కిశోరీతాయి అన్నారు. వీహెచ్‌పీ దుర్గా వాహిని మాతృ శక్తి ఆధ్వర్యంలో శనివారం ఝాన్సీ లక్ష్మీ బాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. వినాయక్ ఘాట్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం నుంచి ఓల్డ్‌సిటీలోని వాసవీ కళాశాల వరకు మహిళల భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో జరిగిన సమావేశంలో భరత మాత, ఝాన్సీ లక్ష్మీబాయి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిశోరీ తాయి మాట్లాడుతూ దేశ వీరోచిత మహిళ ఝాన్సీ లక్ష్మీ బాయిని స్మరించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి మహిళ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. సనాతన ధర్మం ఆచరించాలన్నారు. అంతకు ముందు ద్విచక్ర వాహన ర్యాలీని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయి రెడ్డి, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రాష్ట్ర సేవికా సమితి అఖిల భారతీయ సంపర్క టోలి సదస్యులు విజయభారతి, వాసవీ మహిళా కళాశాల కరస్పాండెంట్ శశికళ, రాష్ట్ర మాతృశక్తి సంయోజిక గౌరీ, దుర్గా వాహిని సంయోజిక రేఖారాణి, మాతృశక్తి జిల్లా కన్వీనర్ జంపాల రాధిక, దుర్గా వాహిని కన్వీనర్ లక్ష్మి, సింధూర వాణి, పావని, రాధాదేవి, సాయిలత, అశ్విని పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కేంద్రీయ బాల సంస్కార కేంద్రం ప్రముఖ్ సుశ్రీ కిశోరీతాయి



బైక్ ర్యాలీలో మాతృశక్తి, దుర్గా వాహిని మహిళలు

## విద్యార్థులకు క్విజ్ పోటీలు



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పెద్దక్క

కర్నూలు కల్చరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం నగరంలోని పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పెద్దక్క అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ నాగరాజు, నిఖిలేష్ ఎడ్యుకేషన్ అకాడమీ అధ్యక్షులు మద్దులేటి క్విజ్ పోటీలను ప్రారంభించారు. క్విజ్ పోటీల్లో ఏక్యాంప్ మాంటిస్సోరి సిస్టర్ స్టాన్సిలాస్, ఎన్నార్ పేట శ్రీలక్ష్మి, పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నాగరాజు, రాయపాటి శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, బాషా, పద్మావతమ్మ, నసీమాబీ, చంద్రమ్మ పాల్గొన్నారు.

## జాతీయ పోటీలకు ‘మాస్టర్స్’ విద్యార్థులు

కర్నూలు (టౌన్): తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్థానిక మద్దూరు నగర్ మాస్టర్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్ లక్ష్మణ్ రెడ్డి తెలిపారు. విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 18 వరకు బి.క్యాంపు క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్–19 విభాగంలో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

## మాతృ మరణాలను అరికట్టాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులను గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందించి మాతృ మరణాలు అరికట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య సూచించారు. శనివారం ప్రాంతీయ శిక్షణా కేంద్రం(ఫిమేల్)లో పెద్దతుంబళం, నందవరం పీహెచ్‌సీ పరిధిలో అక్టోబర్‌లో జరిగిన మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి నెలా 9న జరిగే ప్రధాన మంత్రి మాతృవందన యోజన కార్యక్రమం ప్రతి ఆరోగ్య కేంద్రంలో నిర్వహించాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవి, డీఐఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## 10న ఉప్పర సంఘం కార్తీక వనభోజనాలు

కర్నూలు (న్యూటౌన్): డిసెంబర్ 10న వావిలాల స్కూల్ క్యాంపస్‌లో జిల్లా భగీరథ ఉప్పర సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు సత్యన్న తెలిపారు. శనివారం సంఘం కార్యాలయ ఆవరణలో వనభోజనాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక వనభోజనాల సందర్భంగా మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్తీక వనభోజనాలకు జిల్లాలోని ఉప్పరులు హాజరు కావాలని కోరారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

## కనకదాసు జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు (న్యూటౌన్): డిసెంబర్ 26న మదనపల్లిలో జరగనున్న భక్త కనకదాసు జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏపీ కురుబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బుల శ్రీనివాసులు, యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె రామకృష్ణ కోరారు. శనివారం సంఘం కార్యాలయంలో ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్త కనకదాసు జయంతి కార్యక్రమానికి దేశవ్యాప్తంగా కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, యువజన సంఘం నాయకులు సురేంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సత్యసాయి బాబా జయంతి వేడుకలు ప్రారంభం



ప్రత్యేక అలంకారంలో సాయి మందిరం

కర్నూలు కల్చరల్: భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి వేడుకలు శనివారం నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 23న బాబా జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, ప్రార్థనలు, భజనలు నిర్వహించారు. బాలవికాస్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్, సభ్యులు, సాయి భక్తులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

## పక్కా ప్రణాళికతో పంచాయతీల అభివృద్ధి

- డీపీఓ టి.నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ పంచాయతీలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ సమావేశ భవనంలో జిల్లాలోని డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గతంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామ పంచాయతీ సమావేశాలు జరిగేవని, ప్రస్తుతం ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్: 227 ప్రకారం ప్రతి నెలా సమావేశాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏటా జనవరి 2, ఏప్రిల్ 14, జూన్ 1, అక్టోబర్ 2న గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సభలు, సమావేశాలు నిర్వహించేందుకు సర్పంచులు సహకరించకపోతే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ఈఓఆర్‌డీ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఏడాదికి రూ.21 లక్షలకు మించి ఆదాయం ఉన్న గ్రామ పంచాయతీలను డీపీఓ తనిఖీ చేయాల్సి ఉంటుందని, డివిజన్‌లోని అన్ని పంచాయతీలకు డీఎల్‌పీఓలు, మండలంలోని పంచాయతీలను ఈఓఆర్‌డీలు జాబ్‌చార్ట్ ప్రకారం విజిట్ చేయాల్సి ఉందన్నారు. గ్రామ పంచాయతీల్లోని రికార్డులను కార్యదర్శులు పక్కాగా నిర్వహించాలన్నారు. సమావేశంలో కర్నూలు, ఆదోని డీఎల్‌పీఓలు తిమ్మక్క, శ్రీనివాసులు, నూర్జహాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఓ టీ నాగరాజునాయుడు

## సమాజంలో శాంతే ఇస్లాం ధర్మం

కర్నూలు (రాజ్‌విహార్): సమాజంలో శాంతి, ఎదుటి వారి పట్ల ప్రేమించే గుణం కలిగి ఉండాలని ఇస్లాం బోధిస్తుందని ముస్లిం మత గురువు ఫజీలతుల్ జాఫర్ హుసేన్ మదాని అన్నారు. శనివారం రాత్రి స్థానిక వడ్డెగేరిలోని అహలే హదీస్ మసీదులో ఇస్లాం ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రవక్త మార్గాలు, పవిత్ర గ్రంథం ఖురాన్ బోధించిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మసీద్ కమిటీ పెద్దలు హాఫీజ్ మన్సూర్, అన్వర్ బాషా, షఫీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముస్లిం మత గురువు ఫజీలతుల్ జాఫర్ హుసేన్ మదాని

### తిరుపతి మహా పాదయాత్ర ప్రారంభం

కర్నూలు కల్చరల్: భక్తి చైతన్య పాదయాత్ర వారి ఆధ్వర్యంలో చేపట్టిన తిరుపతి మహా పాదయాత్ర శనివారం ప్రారంభమైంది. ఓల్డ్‌సిటీలోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని జయమ్మ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో పాయద్రాత కమిటీ సభ్యులు శివ, వెంటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలి

కర్నూలు సిటీ: ఉద్యోగుల, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ ప్రాథమిక పాఠశాల టీచర్స్ అసోసియేషన్(అప్టా) అధ్యక్ష, కార్యదర్శులు గణపతిరావు, ప్రకాష్‌రావు శనివారం సంయుక్త ప్రకటనలో కోరారు. కొంత కాలంగా ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పీ ఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని విడుదల చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు.

### 20 నుంచి విధులకు హాజరుకానున్న న్యాయవాదులు

కర్నూలు(లీగల్): రాష్ట్ర బార్ కౌన్సిల్ ప్రవేశపెట్టిన రూ.20 స్టాంప్‌కు వ్యతిరేకంగా నెలన్నర రోజులుగా నిరసనలకు దిగిన న్యాయవాదులు ఈనెల 20 నుంచి విధులకు హాజరుకావాలని నిర్ణయించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి చక్రపాణి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ సోమవారం నుంచి నల్లబ్యాడ్జ్ ధరించి విధులకు హాజరవుతామన్నారు.

### విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకుడికి సన్మానం

కర్నూలు (రాజ్‌విహార్): విద్యుత్ ఉద్యోగుల సంఘం–1104 రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్యకు కర్నూలులో ఘన స్వాగతం లభించింది. జిల్లాకు చెందిన ఆయన రాష్ట్ర అధ్యక్షుడిగా గెలుపొంది తొలిసారిగా కర్నూలుకు రావడంతో వివిధ సంఘాల నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎం.శివకుమార్, బెళగల్ హుసేని, లక్ష్మీకాంత్‌రెడ్డి, నాగరాజు, రవికుమార్, విద్యుత్ అధికారులు మధుసూదన్, సుభాష్ చంద్రబోస్, చిన్నరాఘవులు, రంగస్వామి పాల్గొన్నారు.